భవన నిర్మాణం పూర్తయ్యేదెన్నడు?

- నిధులు మంజూరైనా పూర్తికాని వైనం
- ఇబ్బందుల్లో గ్రామస్తులు, అధికారులు, పాలకవర్గసభ్యులు


శిథిలావస్థలో పంచాయతీ భవనం


అసంపూర్తిగా నూతన భవన నిర్మాణం

ఓదెల: ప్రభుత్వం అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినా.. నిర్మాణంలో నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. మండలంలోని కొలనూర్ పంచాయతీ పక్కా భవనానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా నిర్మాణం మాత్రం పూర్తి కావడం లేదు. అక్టోబర్, 18, 2016లో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2018–19లో పక్కా భవనానికి ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.16లక్షలు మంజూరు చేసింది. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పిల్లర్ల వద్దే పనులు ఆగాయి. ప్రస్తుతం ఉన్న గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థలోకి చేరింది. పైకప్పు చెడిపోవడంతో పాటు ఇరుకైన గదులతో పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. పనులు ప్రారంభించిన వ్యక్తి రూ.6లక్షల వరకు చేసి పనుల నుంచి తప్పుకున్నారు.

ఇరుకు గదులు..

గ్రామసభలు, ప్రభుత్వ సమావేశాలు నిర్వహించాలంటే ఇరుకైన గదులు, చాలీచాలని టాయిలెట్స్, మరుగుదొడ్లతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పక్కా భవనానికి నిధులు మంజూరు చేసినా నిర్మాణం పూర్తి కావడం లేదు. ఉన్నతాధికారులు పట్టించుకొని అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎవరూ ముందుకు రావడం లేదు

కొలనూర్ పంచాయతీ పక్కా భవనానికి 2018–19లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.16లక్షలు మంజూరయ్యాయి. రూ.6లక్షల వ్యయంతో పనులు ప్రారంభమై పిల్లర్ల వరకు వచ్చి ఆగిపోయాయి. ప్రస్తుతం జీపీ భవనం పూర్తి చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. – సమ్మిరెడ్డి ఏఈఈ ఓదెల

వర్షాలు కురిస్తే..



కొలనూర్‌లో అసంపూర్తిగా ఉన్న గ్రామపంచాయతీ భవనాన్ని వెంటనే పూర్తిచేయాలి. భవన నిర్మాణం పూర్తయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలి. శిథిలావస్థలోకి చేరిన గ్రామపంచాయతీలో వర్షాలు కురిస్తే ఎలాంటి పనులు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడుతోంది.

– దొడ్డె స్వామి, కొలనూర్

ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి



కొలనూర్ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు చొరవ తీసుకొని పూర్తిచేయాలి. చాలా ఏళ్లుగా జీపీ భవనం పెండింగ్‌లో ఉండడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఉన్న భవనం కూలడానికి సిద్ధంగా ఉంది.

– గోపు మల్లారెడ్డి, కొలనూర్

నిధులు ఉన్నాయి



కొలనూర్ గ్రామంలో పంచాయతీ భవనాన్ని త్వరగా పూర్తిచేయాలి. నిధులు ఉన్నాయి కాబట్టి త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా చూడాలి. ఉన్నతాధికారులు శ్రద్ధ వహించి పూర్తిచేయాలి. ప్రస్తుతం ఉన్న జీపీ శిథిలావస్థలోకి చేరింది.

– బండారి ఐలయ్యయాదవ్, కొలనూర్

భగీరథ వద్దు.. మా‘నీరు’ కావాలి


ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీడీవో లలిత

ముత్తారం: మానేరు నీరే కావాలని.. మిషన్ భగీరథ నీరు వద్దని గురువారం ప్రజలు కోరారు. ముత్తారంలో పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో అధికారులకు విన్నవించారు. ఏళ్ల తరబడి మానేరు నీరు తాగుతున్నామని, ప్రస్తుతం మిషన్ భగీరథ నీరు కలుషితమై రావడంతో అనారోగ్యానికి గురవుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కార్యదర్శి సంతోష్‌కు భగీరథ తాగునీటి సరఫరా నిలిపివేయలని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు గ్రామసభ నిర్వహించారు. మిషన్ భగీరథ తాగునీటిని ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ డీఈఈ రాజ్‌కుమార్, ఏఈ ప్రణవ్, గ్రిడ్ ఏఈ వంశీ పరిశీలించారు. ల్యాబ్ టెక్నీషియన్‌తో టెస్ట్ చేయిస్తే భగీరథ నీరు బాగానే ఉన్నాయని ఎంపీడీవో లలిత స్థానికులకు వివరించారు. స్థానికులు భగీరథ నీరు ఎలా ఉన్న తమకు వద్దని, మానేరు నీరు కావాలని డిమాండ్ చేశారు. భగీరథ నీరు బాగు ఉన్నప్పుడు తాగునీటి సరఫరా మార్చలేమని అధికారులు చెప్పడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. చివరకు స్థానికుల నిర్ణయం మేరకు అందరి సంతకాలు సేకరించి గ్రామ పంచాయతీ తీర్మానం చేశాక ఉన్నత అధికారులకు నివేదిక పంపిస్తామని అధికారులు పేర్కొనడంతో ప్రజలు శాంతించారు.

నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోండి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేయడం, పాఠ్యపుస్తకాలు, దుస్తులు విక్రయిస్తున్న విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రాజశేఖర్ డిమాండ్ చేశారు. పాఠశాలలు పునఃప్రారంభమై వారం దాటినా సంబంధిత విద్యాశాఖ అధికారులు అటువైపు చూడకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలను మూసివేయించాలన్నారు. నాయకులు అజయ్, సాయితేజ, అరవింద్, రాకేశ్, వంశీ, విష్ణు, సంతోష్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది బదిలీ

కమాన్‌పూర్: కమాన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బందిని ఉన్నత అధికారులు బదిలీ చేశారు. సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుక్క మహేశ్‌ను రామగిరి మండల ఆర్ఐగా, మంథనిలో ఆర్ఐగా పనిచేస్తున్న వెంకటరాజిరెడ్డిని కమాన్‌పూర్ సీనియర్ అసిస్టెంట్‌గా, ఇక్కడ ఆర్ఐగా పనిచేస్తున్న సంధానిని మంథని ఆర్డీవో కార్యాలయానికి, జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మల్కారెడ్డిని పాలకుర్తికి, అక్కడ జూనియర్ అసిస్టెంట్ పని చేస్తున్న కిరణ్‌ను కమాన్‌పూర్‌కు బదిలీ చేశారు.

నేడు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని బాపూజీనగర్‌లో గల శ్రీసాయిబాబా ఆలయ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కాల్వ ఓదెలు తెలిపారు. ఉదయం కుంకుమ పూజలు, హోమం అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కరెంట్ షాక్‌తో ఆవు మృతి

ధర్మారం: మండలంలోని బొమ్మారెడ్డిపల్లికి చెందిన అయిలయ్యకు చెందిన ఆవు గురువారం ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై మృతిచెందింది. అయిలయ్య వివరాల ప్రకారం ఉదయం ఆవు దొరగారి చెలుకలోకి మేతకు పోయింది. అయితే అక్కడే ఉన్న 11కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన ఆవుకు ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ బుస్‌రాడ్ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించింది. సంఘటన జరిగిన సమాచారంతో విద్యుత్తు లైన్‌మెన్ మధు వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. నష్టం జరిగిన రైతుకు ప్రభుత్వ పరిహారం చెల్లించాలని గ్రామస్తులు కోరారు.

26న మండల సమావేశం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 26న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఎంపీపీ బండారి స్రవంతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎమ్మెల్యే విజయరమణారావు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీటీసీలు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నిరుపేద కుటుంబానికి చేయూత

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని సాగర్‌రోడ్డుకు చెందిన నిట్టూరి వైష్ణవి ఇటీవల పాముకాటుతో మరణించింది. విజ్ఞన్న యువసేన వ్యవస్థాపకుడు అల్లం వినోద్‌రెడ్డి సమకూర్చిన 50కిలోల బియ్యాన్ని వైష్ణవి కుటుంబీకులకు గురువారం మున్సిపల్ కౌన్సిలర్ బూతగడ్డ సంపత్, బొడ్డుపల్లి శ్రీను, భీమోజు సురేందర్, రాజు, రమేశ్, నరేశ్, అహమద్ అందించారు.

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

జూలపల్లి: అన్నిరకాల పంటలకు మద్దతు ధర పెంచడమే కాకుండా, ఏకకాలంలో పీఎం కిసాన్ డబ్బులు విడుదల చేసిన పీఎం నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. బీజేపీ సీనియర్ నాయకులు కంకణాల జ్యోతిబసు, తీగెల అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. నాయకులు సంకెన్ల నర్సయ్య, వడ్లకొండ సంపత్, వెంకటనర్సయ్య, అమరగాని నరేశ్, ఉమేశ్, మావురాల మొగిలి, మాదరవేని లచ్చయ్య, పెసరు లచ్చయ్య, బక్కయ్య పాల్గొన్నారు.

దత్తాత్రేయ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

జూలపల్లి: మండల కేంద్రంలోని ఇండేన్ గ్యాస్ గోదాం సమీపంలో శ్రీగురు దత్తాత్రేయ స్వామి ఆలయ నిర్మాణానికి నాగ సాధువులు గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ హాజరై పనులను ప్రారంభించారు. గొట్టిముక్కుల రవీందర్‌రెడ్డి, జ్యోతిబసు, తోట వెంకన్న, దేవుని నర్సమ్మ, దీకొండ వెంకటేశం, మంద చందూ, అంజయ్య, గంగారెడ్డి, మెండె మల్లేశం, డాక్టర్ రామ్‌రెడ్డి, సత్యనారాయణ చారి, చెరుకు కనుకయ్య, వెంకటేశర్లు, భవానీ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఆర్జీ–1 జీఎం


పుష్పగుచ్ఛం అందిస్తున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కోయ శ్రీహర్షను గురువారం ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏరియాలో భూసేకరణ అనుమతి, అర్అండ్అర్ ప్యాకేజీకి సంబంధించి కలెక్టర్‌తో చర్చించారు. ఎస్టేట్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, సాంబశివరావు, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఉన్నారు.

సహకారం అందించాలి


కలెక్టర్‌తో జీఎం ఎస్.సుధాకర్‌రావు

రామగిరి: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కోయ శ్రీహర్షను గురువారం ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్జీ–3 ఏరియాలోని వివిధ గనుల విస్తరణలో భాగంగా భూసేకరణకు సహాయ సహకారాలు అందించాలని జీఎం కలెక్టర్‌ను కోరారు. సీనియర్ ఎస్టేట్ అధికారి కె.ఐలయ్య ఉన్నారు.

ముస్త్యాల చెరువులకు మరమ్మతు చేపట్టండి

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాలలోని చెరువులకు మరమ్మతు చేపట్టాలని కాంగ్రెస్ నాయకులు ఇరిగేషన్ డీఈ రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. చెరువుల నుంచి పొలాలకు నీళ్ల వెళ్లే తూములు, షెటర్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. తూములకు మరమ్మతు చేపట్టాలని నాయకులు సురేష్, కృష్ణ, యాదగిరి, రాజయ్య, శంకర్, సమ్మయ్య, నరేశ్‌లు కోరారు. స్పందించిన డీఈ, ఏఈలు వర్క్ ఇన్‌స్పెక్టర్ సదానందంను గ్రామానికి పంపించడంతో చెరువులను పరిశీలించారు. త్వరలోనే చెరువుల మరమ్మతు పనులు చేపడతామని తెలిపినట్లు నాయకులు తెలిపారు.

పుట్ట మధు ఆరోపణలు సరికాదు



మాట్లాడుతున్న ఐలి ప్రసాద్

మంథని: జెడ్పీచైర్మన్ పుట్ట మధు చేసిన ఆరోపణలు సరికాదని కాళేశ్వరం ఎస్సై భవాని సేన్ లైంగిక దాడిని రాజకీయంగా వాడుకోవడం సిగ్గుచేటని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎరుకల ప్రవీణ్ అన్నారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో గురువారం య న విలేకరులతో మాట్లాడారు. భవాని సేన్‌పై ఆరోపణలు వచ్చిన 24గంటల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు అతడిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించి విచారణ చేపట్టారన్నారు. నాయకులు వొడ్నాల శ్రీనివాస్, నూకల బానయ్య, మంథని సత్యం, కుడుదుల వెంకన్న, జనగామ నర్సింగారావు, కొత్త శ్రీనివాస్, ఆజీంఖాన్, గోటికార్ కిషన్, ఆర్ల నాగరాజు, ఆరెల్లి కిరణ్ ఉన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న జీఎం, అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్జీ–2 జీఎం ఎల్వీ సూర్యనారాయణ అన్నారు. గురువారం ఏరియా కమ్యూనిటీహాల్‌లో గైర్హాజర్ కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగం దొరకడం కూడా కష్టమైన ఈ రోజుల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తున్న సింగరేణి సంస్థలో ఉద్యోగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఏదైన సమస్య ఉంటే అధికారులను కలిసి నివృత్తి చేసుకొని గైర్హాజరు లేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, వకీల్‌పల్లి ప్రాజెక్టు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ మహిపాల్, ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహ్మద్, సేవా అధ్యక్షురాలు మాలతి పాల్గొన్నారు.

భూసారం పెంపుతోనే అధిక దిగుబడి


వివరిస్తున్న ఏవో అలివేణి

పెద్దపల్లిరూరల్: భూమి సారవంతంగా ఉన్నప్పుడే పంట దిగుబడి అధికంగా వస్తుందని మండల వ్యవసాయాధికారి అలివేణి అన్నారు. పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామ రైతువేదికలో గురువారం భూసార పరీక్షలు, మట్టి నమూనా సేకరించే పద్ధతులు, విత్తనశుద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. మట్టి నమూనాలను సేకరించి పరీక్షా కేంద్రం నుంచి వచ్చిన ఫలితాలను బట్టి భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు గుర్తించవచ్చన్నారు. పంట సాగు సమయంలో నాణ్యమైన విత్తనాలనే వాడాలన్నారు. స్థానికంగా లభించే విత్తనాలను శుద్ధి చేసుకుని విత్తితే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని వివరించారు. విత్తనశుద్ధిని ప్రయోగాత్మకంగా వివరించారు. ఏఈవో కల్పనతో పాటు సుధాకర్, మునీందర్ రైతులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రామగిరి: ప్రజలకు సేవ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, పార్టీపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలని నాయకులు హితువు పలికారు. సెంటనరీకాలనీ శ్రీపాద భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం, అక్రమాలు చేసిన వారిపై ఎంత కఠినంగా వ్యవహరిస్తుందో కాళేశ్వరం ఘటన నిదర్శనమన్నారు. 24 గంటల్లో సదరు ఎస్సైని అరెస్ట్ చేయడమే కాకుండా శాశ్వతంగా విధుల్లో నుంచి తొలగించిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో కాంగ్రెస్ చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. యూత్ కాంగ్రెస్ మంథని డివిజన్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మోత్కూరి అవినాష్, పన్నూర్ ఎంపీటీసీ చిందం మహేశ్, నాయకులు మట్ట రాజ్‌కుమార్, సిద్దం మురళీకృష్ణ, బోగి ప్రకాశ్, ఆరెల్లి మహేందర్‌గౌడ్, సంతోష్, సిద్దం రాంనారాయణ, రఘుపతి, గొట్టిముక్కుల మల్లేశ్ గౌడ్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాకార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద 24న చేపట్టనున్న ధర్నాను విజయవతం చేయాలని కాంట్రాక్ట్ కార్మికుల సంఘం ఐఎఫ్‌టీయూ రామగుండం రీజియన్ జాయింట్ సెక్రటరీ నిర్మల పిలుపునిచ్చారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ జీఎం ఆఫీస్ ఏరియాలోని వివిధ సెక్షన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి ధర్నాకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. 24న కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పద్మ, రాజనర్సు, శారద, వెంకటలక్ష్మి, మల్లయ్య, దుర్గేష్, సమ్మయ్య, ప్రేమ్‌కుమార్, సమ్మక్క, రమ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు



బస్సులో తరలిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కోల్‌సిటీ: రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం 30 మంది నిరుపేదలను ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించడానికి క్లబ్ ప్రతినిధులు ఎంపిక చేశారు. కరీంనగర్ రేకుర్తి కంటి ఆస్పత్రికి గోదావరిఖని శ్రీనగర్‌కాలనీలోని లయన్స్ క్లబ్ నుంచి ప్రత్యేక బస్సులో తరలించారు. ప్రతి మంగళ, గురు, శనివారాల్లో లయన్స్ క్లబ్ ద్వారా పేదలకు ఉచితంగా మెడికల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో బీపీ, షుగర్ పరీక్షలతోపాటు నిరుపేదలకు ఉచిత కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా చేయిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు తానిపర్తి విజయలక్ష్మి పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు తానిపర్తి గోపాలరావు, ఎల్లప్ప, రాజేందర్, రంగమ్మ, సత్యనారాయణ, డాక్టర్ వెంకటేశ్వరు, గంగాధర్, శంకరయ్య పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ


ధర్మారం: మాత్రలు వేస్తున్న ఎంపీపీ కరుణశ్రీ

సుల్తానాబాద్/జూలపల్లి/ధర్మారం/జ్యోతినగర్/కోల్‌సిటీ/ఎలిగేడు/కాల్వశ్రీరాంపూర్/రామగుండం/సుల్తానాబాద్‌రూరల్/ఓదెల/ముత్తారం/యైటింక్లయిన్‌కాలనీ: జిల్లాలోని అన్ని గ్రామాల్లో గురువారం జాతీయన నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రాల్లో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు.

పిల్లలను సర్కార్ బడిలో చేర్పించాలి


అవగాహన కల్పిస్తున్న కళాబృందం

కాల్వశ్రీరాంపూర్: తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలంటూ తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృదం ప్రజలకు అవగాహన కల్పించింది. మండలంలోని పెగడపల్లిలో గురువారం కళాబృందం కళాజాత నిర్వహించింది. సర్కారు బడిలో నాణ్యమైన విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, ఇంగ్లీష్ మీడియంలో బోధన ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి సౌజన్య, కళాకారులు వెంకన్న, తిరుపతి, రమాదేవి, రేణుక, శంకర్‌గౌడ్, రాజన్న, శ్రావణ్, పద్మ, శ్రీవల్లి, మల్లేశ్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికులకు సేవకుడిలా పనిచేస్తాం


మాట్లాడుతున్న కౌశికహరి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలోని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సేవకుడిలా పనిచేస్తామని కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశికహరి అన్నారు. కంపెనీ మైన్స్ విభాగంలో గురువారం కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు కౌశికహరితో పాటు ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పెరుమాండ్ల రమేశ్, సదానందం, సతీశ్, రాజేశం, మల్లేషం పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించకుంటే జరిమానా

కోల్‌సిటీ: వ్యాపార సంస్థల యజమానులు డీఅండ్‌వో ట్రేడ్ లైసెన్స్ ఫీజులను సకాలంలో చెల్లించకుంటే జరిమానా తప్పదని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రస్తుతం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ట్రేడ్ లైసెన్స్ రుసుం చెల్లించే గడువు గత మార్చితో ముగిసిపోయినందున ప్రస్తుతం 25శాతం పెనాల్టీతో వసూలు చేయనున్నట్లు తెలిపారు. ఈ జరిమానా జూలై 1 నుంచి 50శాతానికి పెరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్థానిక వ్యాపార సంస్థల యజమానులు త్వరపడి ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వెంటనే చెల్లించి ఆర్థిక భారం తగ్గించుకోవాలని కమిషనర్ సూచించారు.

డిస్పెన్సరీలో సౌకర్యాలు కల్పించాలి


మాట్లాడుతున్న ముల్కూరి శ్రీనివాస్

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని సింగరేణి డిస్పెన్సరీలో సౌకర్యాలు కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు ముల్కూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సెంటనరీకాలనీలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి డిస్పెన్సరీలో ప్రతి నిత్యం కార్మిక కుటుంబ సభ్యులు ఆసుపత్రికి వస్తే పట్టించుకునే వారు కరువయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వచ్చే మహిళలకు డిస్పెన్సరీలో సరైన సౌకర్యాలు లేవన్నారు. సింగరేణి యాజమాన్యం స్పందించి ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. సెంటనరీకాలనీ పట్టణ అధ్యక్షుడు తీగల శ్రీధర్, నాయకులు మేరుగు శ్రీకాంత్, కందుల రమేశ్, ధీరజ్ కృష్ణ, దొంతుల సురేశ్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు

సుల్తానాబాద్: ఇంటింటా నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశం మందిరంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మిషన్ భగీరథ పైప్‌లైన్‌తో పాటు నల్లా కనెక్షన్ ఉందా, లేదా అని పరిశీలించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణతోపాటు సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల పంచాయతీ అధికారి ఫయాజ్ అలీ పాల్గొన్నారు.

గొర్రెల మృతికి కారణమైన రైస్‌మిల్‌పై చర్య తీసుకోండి

మంథని: మండలంలోని ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన గొర్రె రమేశ్‌కు చెందిన గొర్రెల మృతికి కారణమైన రైస్‌మిల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్ డిమాండ్ చేశారు. గొర్రెలు మృతి చెందిన సంఘటన స్థలాన్ని గురువారం పరిశీలించారు. కొన్నేళ్లుగా మిల్లు యాజమాన్యం బొక్కలవాగు నుంచి అనుమతి లేకుండా నీటిని వినియోగిస్తున్నారన్నారు. కరెంట్ తీగ నీటి గుంతలో మునగడంతో కరెంట్ సరఫరా అయి నీరు తాగడానికి వచ్చిన మూగజీవాలు మృత్యువాత పడ్డాయన్నారు. అక్రమంగా వేసిన బోర్‌ను తొలగించడంతో పాటు, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. వేల్పుల సురేశ్, గొర్రె రమేశ్, గంట శ్రీనివాస్ ఉన్నారు.